క్లుప్తంగా

పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ



పెనుగంచిప్రోలు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నందిగామ ఏసీపీ తిలక్ సోమవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించటంతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ వేలంలో ఆలయానికి రూ.31,400 ఆదాయం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద అమ్మవారి మాలాధారణ సందర్భంగా తాత్కాలికంగా దుకాణాలు నిర్వహించుటకు సోమవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.31,400 ఆదాయం వచ్చినట్లు ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ నెల 23 నుంచి 2025, జనవరి 3 వరకు 12 రోజుల పాటు మొత్తం నాలుగు దుకాణాల్లో మాలాధారణ వస్త్రాలు, మాలలు, ఇతర వస్తువులు విక్రయించేందుకు లైసెన్స్ హక్కు ఇస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో అనఘాదేవి వ్రతం



పెనుగంచిప్రోలు: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం అనఘాదేవి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గోశాల పునర్నిర్మాణానికి విరాళం



నందిగామటౌన్: గోశాల పునర్నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని గోశాల నిర్వాహకుడు అంగర రాంబాబు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన త్రయి సంస్థ ప్రతినిధులు కేఎస్‌కే మూర్తి, సత్యనారాయణ, నాగవర్ధినులు అందించిన రూ.50 వేల విరాళం చెక్కును సోమవారం స్థానిక ఎస్‌ఎస్‌ఆర్ చారిటబుల్ సొసైటీ కార్యాలయంలో గోశాల నిర్వాహకుడు రాంబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. మండలంలోని మాగల్లు గ్రామంలోని వైకుంఠ నారాయణ క్షేత్రంలోని 108 అడుగుల లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న గోశాల పునర్నిర్మాణానికి దాతలు సహకరించాలన్నారు. విరాళం అందజేసిన సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఆర్ చారిటబుల్ సొసైటీ ప్రతినిధులు నందిరాజు ప్రకాష్, రాజా హనుమంతరావు, ఏఎస్‌ఎన్‌సీ ట్రస్ట్ ఎక్స్ అఫిషియో సభ్యురాలు నందిరాజు కల్పన తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



జయంతిపురం(జగ్గయ్యపేట): గ్రామంలోని అభయాంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ఆదివారం రాత్రి అయ్యప్ప పడి పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్ప దీక్షాధారుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి వారికి పలు రకాల అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టారు. సింగర్ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామి వారి పడిపూజ, భక్తి పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం

- వాడవాడలా ముస్తాబైన చర్చిలు
- మార్కెట్‌లో కొనుగోలుదారులతో పండుగ శోభ

జగ్గయ్యపేటఅర్బన్/పెనుగంచిప్రోలు/కంచికచర్ల: క్రిస్మస్ వేడుకలకు జగ్గయ్యపేట, నందిగామ పట్టణాలతో పాటు మండలాల్లోని చర్చిలు సిద్ధమయ్యాయి. చర్చిల ముందు క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ స్టార్‌లు, క్రీస్తు జనన సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. చర్చిలను కమిటీ సభ్యులు రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలు దేవాలయాల ఆవరణలో చిన్నారులు ఏర్పాటు చేసిన పశువుల పాకలు ఆకట్టుకుంటున్నాయి. క్రిస్మస్ పండుగను క్రైస్తవులతో పాటు కులమతాలకు అతీతంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. 25వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు ప్రార్థనలు నిర్వహిస్తారు. క్రైస్తవులు బుధవారం తెల్లవారుజామునే క్రీస్తు గీతాలు ఆలపిస్తూ ఆలయానికి చేరుకుంటారు. అత్యంత భక్తిశ్రద్ధలతో ఏసుప్రభువుకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఆలయ కమిటీ సభ్యులు, పాస్టర్లు ముందుగానే ఆలయానికి చేరుకుని క్రీస్తు గీతాలు ఆలపిస్తారు.



పేటలో ముస్తాబైన సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చి



ఆర్సీఎం చర్చికి విద్యుత్ దీపాలతో అలంకారం

అబ్బురపరుస్తున్న క్రిస్మస్ స్టార్‌లు..

జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో క్రిస్మస్ పండుగ సందడి మొదలైంది. పండుగకు నూతన వస్త్రాలు, ఇళ్లకు రంగులు, డెకరేషన్‌ల సామాన్లు కొనుగోలు చేసేందుకు గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పట్టణాలకు తరలిరావటంతో రద్దీ పెరిగింది. ఈ సందర్భంగా క్రిస్మస్ ట్రీలు, స్టార్‌లు, వివిధ డెకరేషన్ సామగ్రి అమ్మే దుకాణాల వద్ద కొనుగోలుదారులు బారులు తీరటంతో కిటకిటలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, రంగుల షాపుల్లో వినియోగదారుల సందడి నెలకొంది. క్రిస్మస్ స్టార్‌లు, రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణ సామగ్రికి విపరీతంగా డిమాండ్ ఏర్పడింది. స్టార్‌లు, పశువుల పాక, లేజర్ లైట్లు, క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్ డ్రస్, మాస్క్‌లను కొనుగోలు చేశారు. దీంతో పట్టణాల్లో పండుగ శోభ సంతరించుకుంది.



విద్యుత్ వెలుగులో గండేపల్లి సీఎస్ఐ చర్చి



పెనుగంచిప్రోలులోని షాలోమ్ చర్చి



ఏసు తిరుహృదయ ఆర్సీఎం చర్చి



పేటలో క్రిస్మస్ స్టార్‌లు కొనుగోలు చేస్తున్న క్రైస్తవులు



కంచికచర్ల పోలీస్‌స్టేషన్‌లో పశువుల పాక



ముచ్చింతాలలోని లూర్ధుమాత ఆలయం

వంట ఏజెన్సీలకు కార్మిక చట్టం అమలు చేయాలి

కంచికచర్ల: స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల మండల అధ్యక్షురాలు ఝాన్సీ అధ్యక్షతన కార్మికుల సమావేశం సోమవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐఎఫ్‌టీయూ గౌరవ అధ్యక్షుడు జి.హరికృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కార్మిక చట్ట ప్రకారం కార్మికులకు నెలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వంట ఏజెన్సీ కార్మికులకు నెలకు రూ.3 వేలు ఇచ్చి వెట్టి చాకిరి చేయిస్తున్నారని, ప్రతి నెల ఇవ్వకుండా నాలుగు లేదా ఐదు నెలలకు ఒకసారి జీతం ఇస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వటంతో పాటు ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంట ఏజెన్సీ కార్మికులు వనజాక్షి, కాంతమ్మ, మౌనిక కుమారి, లావణ్య, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో సమావేశమైన మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

జగ్గయ్యపేట: భూ సమస్యలు పరిష్కరించుకునేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్ పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. రైతులు దరఖాస్తులు అందిస్తున్నారని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 23 దరఖాస్తులు అందాయని చెప్పారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్ అనూష్‌బాబు, ఆర్‌ఐ సూరమ్మ, వీఆర్వో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక భూ సమస్యలకు పరిష్కారం

నందిగామటౌన్: రైతుల వ్యవసాయ భూములకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ సురేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడు గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం పట్టాదార్ పాస్ పుస్తకం, భూసర్వే, అడంగల్, తదితర సమస్యలు పరిష్కరించాలని రైతులు అర్జీలు అందించినట్లు చెప్పారు. అర్జీలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే..

వీరులపాడు: రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామ శివారు లక్ష్మీపురం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి 45 రోజుల్లోగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం రైతులు పలు సమస్యలపై 10 దరఖాస్తులు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతీ దేవి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నవాబుపేట(పెనుగంచిప్రోలు): స్థానిక విశ్వవాణి విద్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేయటంతో పాటు ఏసుక్రీస్తు శాంతి, ప్రేమ, దయాగుణాన్ని తెలియజేశారు. అలాగే క్రిస్మస్ తాత వేషధారణలతో పాటు చిన్నారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గింజుపల్లి రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

చందాపురం పాఠశాలలో..

నందిగామటౌన్: మండలంలోని చందాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఏసు జన్మ వృత్తాంతాన్ని తెలిపే పశువుల పాక చూపరులను ఆకట్టుకుంది. ముందుగా ఏసు జననాన్ని స్వాగతిస్తూ ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ చించివేత



కంచికచర్ల: మండలంలోని పరిటాలలో ఈ నెల 21న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఎస్సీ ఏరియాలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి చించివేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు చించిన ఫ్లెక్సీని పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీని చించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులపై పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై నాయకులు మండిపడ్డారు.

రైతులు పంట మార్పిడి విధానం పాటించాలి

పెనుగంచిప్రోలు: రైతులు పంట మార్పిడి పాటించాలని ఉద్యాన శాఖాధికారి టి.వర్ధిని చెప్పారు. మండలంలోని పెనుగంచిప్రోలు, మక్కపేట, భీమవరం, కన్నెవీడు, రామచంద్రునిపేట, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లోని మిర్చి తోటలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిర్చిలో లద్దె పురుగు మొదటి దశలో ఆకులను నష్టపరిచి తరువాత కాయల్లో చేరి గింజలు తినేస్తాయన్నారు. వీటి వల్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. పురుగు నివారణకు ఎకరానికి 500 మిల్లీ లీటర్ల క్లోరిఫైరిఫాస్ లేదా స్పైనోసాడ్ 15 మిల్లీ లీటర్లు లేదా క్వినాల్ ఫాస్ 400 మిల్లీ లీటర్లు పిచికారీ చేయాలన్నారు. విషపు ఎరల ద్వారా బాగా పెరిగిన లద్దె పురుగులను నియంత్రించవచ్చన్నారు.

తెల్లనల్లి నివారణకు సూచనలు..

విషపు ఎరను 5 కిలోల తవుడు, 500 గ్రాముల కార్బిరల్ లేదా 500 మిల్లీ లీటర్ల క్లోరిఫైరిఫాస్, 500 గ్రాముల బెల్లంతో తగినంత నీటిని కలిపి తయారు చేయాలన్నారు. ఈవిధంగా తయారు చేసిన గుళికలను సాయంత్రం పొలంలో సమానంగా చల్లితే నేలలో దాగిఉన్న పురుగులు రాత్రులు బయటకు వచ్చి తినటం వల్ల చనిపోతాయని చెప్పారు. తామర పురుగు నివారణకు ఎకరానికి పిప్రోనిల్ 400 గ్రాములు లేదా పెగాసిస్ 300 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. తెల్లనల్లి నివారణకు ఎకరాకు డైకోఫాల్ 1 లీటరు నీళ్లలో లేదా గంధకం 600 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. ఎడుతెగులు నివారణకు కిలో ట్రైకోడెర్మావిరిడి 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండితో కలిపి వారం రోజులు పేడలో మాగనిచ్చి ఆఖరు దుక్కిలో వేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారి వర్ధిని

రేషన్ డీలర్ల సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని వినతి

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రంలో ఉన్న 29 వేల మంది రేషన్ డీలర్లకు ఉపయోగపడే విధంగా సంక్షేమ నిధిని కేరళ రాష్ట్రంలో మాదిరిగా మన రాష్ట్రంలోనూ ఏర్పాటుకు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ రేషన్ డీలర్ల సంక్షేమ వేదిక సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ముత్యాల శేషగిరిరావు ఆధ్వర్యంలో సోమవారం వేదిక కార్యవర్గ సభ్యులు విజయవాడలోని పౌర సరఫరాలశాఖ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. డీలర్ల వ్యవస్థకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు శేషగిరిరావు తెలిపారు. స్పందించిన మంత్రి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిచంద్రారెడ్డి, కోశాధికారి బుంగా రాజు, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, శివప్రసాద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఇందిరా, కోశాధికారి రాజేశ్వరి ఉన్నారు.



మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన ఏపీ రేషన్ డీలర్ల సంక్షేమ వేదిక సభ్యులు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి

జగ్గయ్యపేటఅర్బన్: కూటమి ప్రభుత్వం వైఫల్యాలను గ్రామాల్లో ప్రజలకు తెలియజేస్తూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. నందిగామ మండలం, దాములూరు గ్రామానికి చెందిన వంగల సాయి బ్రదర్స్ తన్నీరు నాగేశ్వరరావును స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులతో కలిశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని తన్నీరుకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు బద్దూనాయక్, సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



తన్నీరుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని అందజేస్తున్న నాయకులు

ముగిసిన షటిల్ టోర్నమెంట్



విజేతలతో ఫ్రెండ్స్ రిక్రియేషన్స్ ప్రతినిధులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ఫ్రెండ్స్ రిక్రియేషన్స్ ఆధ్వర్యంలో స్థానిక పాత ఎస్‌ఎస్‌పీ కాలనీ గ్రౌండ్‌లో ఉత్కంఠభరితంగా జరిగిన షటిల్ క్రీడా పోటీలు సోమవారం సాయంత్రంతో ముగిశాయి. విజేతలుగా స్థానిక నటరాజ్ – ఇరహాన్ టీమ్, రన్నర్స్‌గా రిక్రియేషన్స్ వారి హోమ్ టీమ్, మూడో స్థానంలో ఆర్టీసీ హనుమంతరావు – కార్తీక్ టీమ్, నాల్గవ స్థానంలో టీచర్ నాగేశ్వరరావు – రాంబాబు టీమ్ నిలిచాయి. విజేతల మొదటి బహుమతి రూ 5,116 లను, మెమెంటోలను నిర్వాహకులు రాజ్ కిషోర్ నాని, కంగన్ రమేష్, భూపతి రాంబాబు, న్యాయవాది ఆరేపల్లి వెంకటేశ్వర్లు అందజేశారు. త్వరలో మెగా టోర్నమెంట్‌ను నిర్వహిస్తామని సంస్థ ప్రతినిధి నాని తెలిపారు. కార్యక్రమంలో 108 రమేష్, గడ్డం రమేష్, అల్లిక నరసింహారావు, కామినేని రమేష్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న డివైడర్

జగ్గయ్యపేట: పట్టణంలో జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లు రోడ్డులో ఏర్పాటు చేసిన డివైడర్ పిచ్చి మొక్కలతో అధ్వానంగా దర్శనమిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.కోట్లతో నాలుగు లైన్ల రహదారి ఏర్పాటు చేశారు. దీనికి తోడు దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ఉన్న రహదారికి బటర్ ఫ్లై లైట్లు ఏర్పాటు చేశారు. ఆ తరువాత ఆలనాపాలనా కరువవటంతో డివైడర్ అధ్వానంగా మారింది. పిచ్చి, కంప చెట్లు దట్టంగా పెరిగి ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోల్లో ప్రయాణించే ప్రయాణికుల కళ్లకు తగిలి ప్రమాదాలు జరిగిన ఘటనలు కూడా ఉన్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా లైట్లు కూడా వెలగటం లేదని అధికారులు కనీసం పట్టించుకోవటం లేదని సమీపంలోని ప్రజలు, వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డివైడర్‌లపై ఉన్న పిచ్చి, కంప చెట్లను తొలగించటంతో పాటు కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



జగ్గయ్యపేట-చిల్లకల్లు డివైడర్‌పై పెరిగిన పిచ్చి, కంప చెట్లు

అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై అవగాహన అవసరం

మైలవరం: విద్యార్థులు అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై అవగాహన పెంచుకోవాలని వైస్ ప్రిన్సిపాల్ బి.రమేష్‌రెడ్డి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 'డేటా సైన్స్ యూజింగ్ పైథాన్' అనే అంశంపై వారం రోజులు నిర్వహించే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కళాశాలలో నిర్వహిస్తున్న వర్క్‌షాపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలన్నారు. బ్రెయిన్ ఓ విజన్ ప్రతినిధులు విద్యార్థులకు వర్క్‌షాపు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ విభాగాధిపతి కన్వీనర్ డాక్టర్ డీ వీరయ్య, కో కన్వీనర్, కళాశాల డీన్ అండ్ అకడమిక్ డాక్టర్ ఎమ్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. కళాశాల ఐటీ విభాగం విద్యార్థులు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్- 2024 గ్రాండ్ ఫినాలే హార్డ్‌వేర్ ఎడిషన్ కింద విజయం సాధించి కళాశాలకు గర్వకారణమయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు సోమవారం తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం కర్ణాటకలోని హుబ్లీ నగరంలో కేఎల్‌ఈ టెక్నాలజికల్ యూనివర్సిటీలో నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పోటీలలో తమ కళాశాల విద్యార్థులు అసాధారణమైన ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించారని తెలిపారు.